సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 19 । ఆగస్టు । 2024



**మోత మోగుతున్న 'కనకం'**
గత 20 రోజుల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరిలో కనకం మోత మోగుతోంది. అది ధరల్లో కాదు.. ఈ సారి అమ్మకాల్లో.
8లో



**ఆక్వాటిక్ చికెన్.. తిలాపియా**
చేపల సాగులో హైబ్రీడ్ వంగడాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో ఒకటి తిలాపియా. ఆక్వాటిక్ చికెన్‌గా ఈ చేపకు గుర్తింపు ఉంది.
8లో



**అత్యాచారం కేసులో ముగ్గురికి రిమాండ్**
ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని రామకోటి వద్ద మహిళపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది.
8లో

## న్యూస్‌రీల్

### ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా ధాత్రిరెడ్డి



బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కేఆర్ పురం ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు ఆఫీసర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయానికి కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆదివారం ఐటీడీఏ అధికారులు తెలిపారు. ఇక్కడ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన ఎం.సూర్యతేజను నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఐటీడీఏ పీఓగా ఏపీ అర్బన్ ఫైనాన్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.హరితను నియమించగా.. ఆమెను అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. దీంతో ఇన్‌చార్జి పీఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనుకుమార్ కొనసాగుతున్నారు. తాజాగా జేసీ ధాత్రిరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

### గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు



బుట్టాయగూడెం మండలం కామవరంలో గుబ్బల మంగమ్మ తల్లికి పూజలు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా దర్శనాలు నిలిపివేసిన తర్వాత మళ్లీ దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ ఆదివారం తక్కువ మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కోర్సా గంగరాజు, కోర్సా రాంబాబులు, తెలిపారు.

### ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చింతలపూడి: చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సంపత్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. పాఠశాలలో 8, 9 తరగతులు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఇటీవల బాలికలు, వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించారు. బాలికలను విచారించిన అనంతరం ఐసీడీఎస్ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు కలెక్టర్ ఆదేశాలపై ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ అబ్రహం తెలిపారు.

### కేసు నమోదుకు డబ్బుల డిమాండ్ !

**సోషల్ మీడియాలో వైరలవుతున్న మెసేజ్**

ద్వారకాతిరుమల: తనకు జరిగిన అన్యాయంపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆశ్రయిస్తే డబ్బులు డిమాండ్ చేస్తూ, తాత్సారం చేస్తున్నారని ఆదివారం సోషల్ మీడియాలో బాధితురాలు ఆరోపిస్తున్నట్టు పెట్టిన మెసేజ్ వైరలవుతోంది. మండలంలోని రామసింగవరానికి చెందిన మహిళ ఈ నెల 2న జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆస్పత్రిలో చేరింది. పొలంలో పనిచేసుకుంటున్న తనపై అదే గ్రామానికి చెందిన మానికల శ్రీను దాడి చేసి, గాయరపచి, అత్యాచారం చేశాడని, స్థానికుల సాయంతో ఆస్పత్రిలో చేరినట్టు ఎమ్మెల్సీ(మెడికో లీగల్ కేసు) రిపోర్టులో పేర్కొంది. ఈ రిపోర్టు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు చేరి రోజులు గడుస్తున్నా కేసు నమోదు చేయలేదని, అడిగితే రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారంటూ ఆ మహిళ ఎమ్మెల్సీ రిపోర్టును, మెసేజ్‌ను ఒక వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాడు. దీనిపై పోలీసులను సంప్రదించగా వారు స్పందించలేదు.

# సదరంలో చేతివాటం



**సర్టిఫికెట్ల జారీకి మామూళ్లు**
- వైకల్య శాతాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు రేటు
- అధికార పార్టీ నేతలు, సిబ్బంది దళారుల అవతారం
- గత టీడీపీ హయాంలో తణుకులో వెలుగుచూసిన అవినీతి
- అప్పట్లో సదరం గదిని సీజ్ చేసిన అధికారులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సదరం విభాగం వద్ద వేచి ఉన్న దివ్యాంగులు, వారి సహాయకులు

సాక్షి, భీమవరం: దివ్యాంగుల వైకల్య శాతాన్ని నిర్ధారించే సదరం శిబిరాల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వ పథకాలకు అవసరమైన వైకల్య శాతంతో సర్టిఫికెట్లు జారీ చేసే పేరిట చేతివాటం చూపిస్తున్నారు. వైకల్యాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు బేరసారాలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పలు సదరం కేంద్రాల్లో ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా చాపకింద నీరులా సాగుతోంది.

జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లులోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, కళ్లతో పాటు మానసిక వైకల్యానికి సంబంధించిన దివ్యాంగులకు, తాడేపల్లిగూడెంలో కళ్లు, ఎముకలు, మిగిలిన కేంద్రాల్లో ఎముకలకు సంబంధించి వైకల్య శాతం నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. వారానికి రెండు రోజులు జరిగే ఈ సదరం శిబిరాల్లో స్లాట్ బుకింగ్‌ను బట్టి ఒక్కో శిబిరంలో 15 నుంచి 20 మంది చొప్పున వారంలో జిల్లాలో 150 మంది నుంచి 200 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

**వైకల్య శాతం పెంచే పేరిట వసూళ్లు**

దివ్యాంగులకు పింఛన్లు, పరికరాలు, బస్, రైలు ఉచిత ప్రయాణ పాసులు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఇలా ఏది పొందాలన్నా సదరం సర్టిఫికేట్ తప్పనిసరి. ఎముకలకు సంబంధించి 45 శాతం పైనా, చెవి, ముక్కు వారికి 70 శాతం పైనా ఇలా నిర్ణీత వైకల్యం ఉన్న వారికే దివ్యాంగ పింఛన్ సాయం అందుతుంది. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు అవసరమైన వైకల్య శాతంతో సర్టిఫికెట్లు జారీ చేయించే పేరిట కొందరు మామూళ్లకు తెరలేపుతున్నారు. అధికంగా ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, మానసిక విభాగాల్లో శిబిరాలు నిర్వహిస్తున్న తణుకుతో పాటు జిల్లాలోని పలు కేంద్రాల్లో ఈ వసూళ్లు జరుగుతున్నాయి. పింఛన్ సాయం పొందేలా తక్కువ వైకల్యం ఉన్న వారికి ఎక్కువగా ఉన్నట్టు చూపించేందుకు వీలును బట్టి అందిన కాడికి దోచుకుంటున్నారు. రూ.10 వేలు నుంచి రూ. 30 వేలు వరకు బేరసారాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. కొంతమంది అధికార పార్టీ నాయకులతో పాటు సదరం సిబ్బంది ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తంలో ఎవరి వాటా వారికి చేరుతున్నట్టు సమాచారం.

**గతంలో వెలుగుచూసిన అక్రమాలు**

సదరం సర్టిఫికెట్లు జారీకి సంబంధించి టీడీపీ హయాంలో గతంలో తణుకులో పెద్ద దుమారమే రేగింది. టీడీపీ నాయకులతో డీఆర్‌డీఏకు చెందిన కొందరు సిబ్బంది కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారు. వైద్యుడి సంతకం ఫోర్జరీ చేసి తక్కువ వైకల్యం ఉన్న వారికి ఎక్కువగా వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్లు ఇచ్చేశారు. 2018 ఫిబ్రవరిలో వెలుగు చూసిన ఈ వ్యవహారం అప్పట్లో సంచలనమైంది.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా..**

టీడీపీ హయాంలో సదరం సర్టిఫికెట్లు జారీ ప్రహసనంగా సాగేది. రాజకీయ సిఫార్సులున్న వారికే పరీక్షలు చేసేవారు. నెలల తరబడి వేచి చూసినా సర్టిఫికెట్లు అందక దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు తీవ్ర వ్యయప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. 2019లో వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగుల సమస్యలకు చెక్‌పెట్టారు. దాదాపు ప్రతి నియోజకవర్గంలోని ఆస్పత్రిలో సదరం శిబిరాల నిర్వహణ ద్వారా కేంద్రాలను చేరువ చేశారు. నిర్ధారణ పరీక్షల కోసం పడిగాపులు పనిలేకుండా స్లాట్ బుకింగ్ సౌలభ్యం కల్పించారు. దీనిద్వారా పరీక్షల కోసం నిర్ణీత రోజున, నిర్ణీత సమయానికి వెళ్లే వీలు కలిగింది. అవినీతి అక్రమాలకు తావు లేకుండా సర్టిఫికెట్ల జారీని పారదర్శకంగా నిర్వహించారు.

### ఆటోలో మర్చిపోయిన బంగారం బ్యాగ్

**గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు**



బ్యాగ్‌ను అందజేస్తున్న ఏలూరు త్రీటౌన్ పోలీసులు, చిత్రంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: బంగారు వస్తువులున్న బ్యాగ్‌ను ఆటోలోనే ప్రయాణికులు మర్చిపోగా.. కేవలం గంటల వ్యవధిలోనే ఆటోను ట్రేస్ చేసి ఆ బ్యాగ్‌ను పోలీసులు ప్రయాణికులకు అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన చిట్టి శివకుమారి ఏలూరు కొత్తపేటలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు ఆదివారం ఉదయం వచ్చారు. కొత్తపేట నుంచి ఆటోలో కల్యాణ మండపానికి ఉదయం 11 గంటలకు వెళ్లారు. బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయారు. ఆ బ్యాగ్‌లో 80 గ్రాముల ఆభరణాలు, దుస్తులు ఉన్నాయి. వెంటనే ఆమె ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. త్రీటౌన్ సీఐ కే.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్‌ఐలు ప్రసాద్, అజయ్‌కుమార్, హెచ్‌సీ విజయరాజు, రఘు రంగంలోకి దిగారు. ఆటోయూనియన్‌ను సంప్రదించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటో కదలికలను గుర్తించారు. ఆటోను స్వాధీనం చేసుకుని పరిశీలించగా శివకుమారి మర్చిపోయిన బ్యాగ్ ఆటోలోనే ఉన్నట్లు గుర్తించారు. బ్యాగ్ ఆటోలో ఉన్న విషయం ఆటోడ్రైవర్‌కు తెలియదని పోలీసులు నిర్ధారించారు. బ్యాగ్‌ను డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సమక్షంలో ఫిర్యాదుదారులకు అప్పగించారు.

# ఇకపై ఆరు రోజులు

- ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు
- సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా పేరు మార్పు
- ఈ నెల 27 నుంచి వచ్చే నెల 4 వరకు పరీక్షలు

నిడమర్రు : విద్యా సామర్థ్యం అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును సెల్ఫ్ అసెస్‌మెంట్(స్వీయ మూల్యాంకనం)గా మార్చుతూ పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఫార్మెటివ్ అసెస్‌మెంట్(నిర్మాణాత్మక మూల్యాంకనం) పేరుతో 3 రోజులు నిర్వహించేవారు. తాజాగా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఆరు రోజులు పరీక్ష నిర్వహిస్తారు. స్వీయ మూల్యాంకనం-1 పరీక్షలను ఈ నెల 27 నుంచి వచ్చే నెల 4 వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు మినహా అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా పరీక్ష పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**20 మార్కులకు పరీక్ష**

ఇంతవరకూ యూనిట్ పరీక్షల స్థానంలో నిర్వహించే ఫార్మెటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండటంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం సబ్జెక్టుకు 6 రోజుల పాటు నిర్వహించనున్నారు. దీని వల్ల సిలబస్‌పై ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయవర్గాలు చెపుతున్నాయి. నెలవారీ సిలబస్‌లో 3 రోజులు కుదించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

**షెడ్యూల్ ఇదీ**

ఈ నెల 27 నుంచి వచ్చే నెల 2 వరకు ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుండి 11.45 పరీక్ష నిర్వహిస్తారు. 28న తెలుగు, 30న ఇంగ్లీషు, 31న గణితం, సెప్టెంబరు 2న పరిసరాల విజ్ఞానం పరీక్షలు ఉంటాయి. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుండి 2.30 గంటల వరకూ నిర్వహించనున్నారు. 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించనున్నారు.



**టోఫెల్ పరీక్షలకు మంగళం**

ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి జూలై వరకూ టోఫెల్ తరగతులు నిర్వహించారు. జూలై 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024-25 అకడమిక్ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణపై ఎలాంటి పిరియడ్స్ కేటాయించకపోవడంతో.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంతవరకూ అమలవుతున్న టోఫెల్ తరగతులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో ఈ స్వీయ మూల్యాంకనం పరీక్షల్లో టోఫెల్ పరీక్షలు నిర్వహించరు.

**డీసీసీబీ నుంచి ప్రశ్నాపత్రాలు**



నిర్మాణాత్మక మూల్యాంకనం పేరును స్వీయ మూల్యాంకనంగా మార్చి ఈ నెల 27 నుంచి నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుత సమాచారం ప్రకారం డీసీసీబీ ముద్రించిన ప్రశ్నాపత్రాలు ఆయా పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకుంటాం. 3నుండి 8 తరగతుల వరకూ సీబీఏ విధానంలో ఓఎంఆర్ షీట్స్‌పై పరీక్షలు నిర్వహిస్తాం.
– పువ్వుల శేషు, ఎంఈవో-1, నిడమర్రు

# వేదం.. ఆధ్యాత్మిక నాదం

- వైభవంగా 104వ వేద సభ
- పది రాష్ట్రాల నుంచి వేద విద్యార్థుల రాక

గణపవరం: వేద పండితులు, ఘనపాఠీల పాదస్పర్శతో గణపవరం మండలం సరిపల్లె గ్రామం పులకించింది. పండితుల వేద మంత్రాలు, వేద విద్యార్థుల అర్థ తాత్పర్యాలతో మార్మోగింది. సరిపల్లెలోని సఖ్యాభివర్ధక నిలయంలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 104వ వేద శాస్త్ర పరిషత్ మహాసభలు వైభవంగా జరిగాయి. 1919లో స్వర్గీయ ఈమని వెంకటేశ్వర్లు స్థాపించిన సఖ్యాభివర్ధక నిలయంలో 104 సంవత్సరాలుగా విరామం లేకుండా ఏటా ఈ వేదసభలు నిర్వహిస్తున్నారు. నిర్వహణకు గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం, గణపవరానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త కూసంపూడి సుబ్బరాజు ఆర్థిక సహకారంతో ఈ మహాసభలు నిర్వహిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి వేద విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఏటా శ్రావణ పౌర్ణమి రోజున వేద పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ఉత్తీర్ణతా పత్రాలు, పట్టాలు పంపిణీ చేస్తారు. ఈ పట్టాలకు దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలు, దేవాలయాలలో మంచి గుర్తింపు ఉండటంతో ఏటా వందలాది విద్యార్థులు ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలకు హాజరవుతారు.

ఈ ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, బిహార్, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలకు చెందిన 106 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి మూడు రోజులపాటు సరిపల్లె గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం భోజన, వసతి సదుపాయాలు కల్పించింది. శని, ఆదివారాలలో ఘనపాఠీలు, వేద పండితులు నాలుగు వేదాల్లో పరీక్షలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు కూడా ఇక్కడి వేదపాఠశాల విద్యార్థులు కావడం విశేషం. గణపవరం వేద పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన అనేక మంది దేశవ్యాప్తంగా వివిధ ప్రధాన ఆలయాలలో ఆగమ శాస్త్ర పండితులుగా ఉన్నారు. ఆదివారం సుమారు 60 మంది విద్యార్థులకు వివిధ ప్రశ్నలు సంధించి వేద నైపుణ్యాన్ని పరీక్షించారు.





సరిపల్లెలో వేద విద్యార్థులను పరీక్షిస్తున్న ఘనాపాఠీలు, వేద పరీక్షలకు సిద్ధమవుతున్న వేద విద్యార్థులు

**నాలుగు దశాబ్దాలుగా వస్తున్నా**



నేను ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలకు 38 సంవత్సరాలుగా పరీక్షాధికారిగా వస్తున్నా. నా కన్నా ముందు మా తండ్రి ఆంజనేయ ఘనపాఠీ, పెద తండ్రి వెంకటనారాయణ ఘనపాఠీలు పరీక్షాధికారులుగా వ్యవహరించారు. 21 మందిని పరీక్షించగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు. – గుళ్లపల్లి విశ్వనాథ ఘనపాఠీ, శ్రీకృష్ణ యజుర్వేద పరీక్షాధికారి

**వేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు**



నేను 13 ఏళ్లుగా పరీక్షాధికారిగా వస్తున్నాను. ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలకు దేశంలో మంచి గుర్తింపు ఉంది. అందువల్ల మంచి అవకాశాలు ఉంటాయి. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది.
– విష్ణుభట్ల శ్రీకృష్ణ ఘనపాఠీ, తెనాలి

**వేద పరీక్షకు మంచి గుర్తింపు**



ఇక్కడి వేదపాఠశాలకు మంచి గుర్తింపు ఉండేదని మా పూర్వీకుల ద్వారా తెలుసుకున్నాను. ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలు భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉంటాయన్న నమ్మకంతో పరీక్షకు హాజరయ్యా.
– రుష్యట్ శర్మ, ఉజ్జయిని

**తొలిసారి వచ్చాను**



నేను తిరుపతి వెంకటేశ్వర వైదిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. ఈ ఏడాది నుంచి ఇక్కడ శుక్ల యజుర్వేద పరీక్షలు తొలిసారిగా ప్రారంభించడంతో నన్ను పరీక్షాధికారిగా పిలిచారు. తొలిసారిగా వేదవిద్యార్థులను పరీక్షించడం మంచి అనుభూతినిచ్చింది.
– గోవింద్ ప్రసాద్ అధికారి, పరీక్షాధికారి

**ఉత్తీర్ణత సాధించాను**



నేను మైసూర్ దత్త పీఠంలో వేద విద్య అభ్యసిస్తున్నాను. జటఘనం విభాగంలో వేద విద్య నేర్చుకుంటున్నాను. క్రమాంతం పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉంది.
– గుళ్లపల్లి సహ్యాత్ నారాయణ శర్మ, కర్నాటక

### ● రాఖీ సందడి



తాడేపల్లిగూడెం పట్టణంలోని ఒక షాపు వద్ద రాఖీలు కొంటున్న బాలికలు

రక్షా బంధన్.. సోదరీ సోదరుల మధ్య ప్రత్యేక అనుబంధానికి ప్రతీక. శ్రావణ పౌర్ణమి నాడు జరుపుకునే ఈ రాఖీ పండుగ సోదర ప్రేమకి సంకేతం. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల వారి మధ్య బాంధవ్యం కలకాలం నిలవాలని జరుపుకునే పండుగ. సోదరికి జీవితాంతం తోడుగా ఉంటామని సోదరుడు భరోసా ఇచ్చే పండుగ. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్టాల్స్‌లో రాఖీలు కనువిందు చేశాయి. రూ.10 నుంచి రూ.250 వరకు ఖరీదు చేసే రాఖీలు అందుబాటులో ఉంచారు.
– తాడేపల్లిగూడెం రూరల్

# చెంతనే ఉన్నా.. ఇసుకే బంగారమాయె

- కుక్కునూరులో నిలిచిన రెండు స్టాక్ పాయింట్లు
- చేబ్రోలు ఇసుకలో మట్టి ఉండటంతో కొనుగోళ్లు బంద్
- తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇసుక తరలింపు
- 20 టన్నుల లారీ ఖర్చు రూ.40 వేల పైగానే

సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో ఇసుక విరివిగా దొరికినా.. ఈ జిల్లా వాసులకు మాత్రం అందుబాటులో లేదు. రెండు జిల్లాల్లో పదికి పైగా రీచ్‌లు, 12కు పైగా డీసిల్ట్ పాయింట్లు, మరో 10 స్టాక్ యార్డులు ఉన్నాయి. ఒక్కచోట కూడా ఇసుక లభ్యం కావడం లేదు. దాదాపు నెల రోజుల నుంచి జిల్లాలో ఇదే పరిస్థితి. తూర్పు గోదావరిలోని స్టాక్ పాయింట్ల నుంచి వేల రూపాయలు ఖర్చు చేసి ఇసుక కొనుగోళ్లు చేయాల్సి వస్తోంది.

ఏలూరు జిల్లాలోని కుక్కునూరులో వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్లు, ఉంగుటూరు నియోజకవర్గం చేబ్రోలులోని స్టాక్ పాయింట్‌లో గత నెల 8న ఉచిత ఇసుక పథకాన్ని ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించింది. మూడు స్టాక్ యార్డుల్లో కలిపి 72 వేల టన్నులు నిల్వ ఉండగా.. ఉచితం పేరుతో మూడు స్టాక్ యార్డుల్లో మూడు రకాల రేట్లు నిర్ణయించి భారీ దోపిడీకి తెరదీశారు. వింజరం, ఇబ్రహీంపేటలో టన్ను ధర రూ.210, చేబ్రోలులో రూ.538గా నిర్ణయించి అమ్మకాలు ప్రారంభించారు. వేలేరుపాడు, కుక్కునూరులో ఐదు ఇసుక రీచ్‌లు, పోలవరంలో డీసిల్ట్ పాయింట్, పశ్చిమగోదావరి జిల్లా నడిపూడి-2, కరుగోరుమిల్లి-2, కోడేరులో -2 మొత్తం 6 రీచ్‌లు, యలమంచిలి, నర్సాపురంలో 5 డీసిల్ట్ పాయింట్లు, ఆరు స్టాక్ యార్డులు ఉన్నాయి. ఇసుక రీచ్‌లన్నింటికీ పర్యావరణ అనుమతులు, ఇతర సాంకేతికపరమైన కారణాలు, వరద ఉధృతితో ఉచిత ఇసుక పథకం ప్రారంభమైనా ఎక్కడా ఇసుక లభ్యం కాని పరిస్థితి.

**భవన నిర్మాణం రంగంపై ప్రభావం**

పశ్చిమగోదావరి జిల్లా వాసులందరూ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లా స్టాక్ పాయింట్ల నుంచి రవాణా ఖర్చులు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. గత నెలరోజులుగా ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ రంగంపై ప్రభావం అధికంగా పడింది. ఏలూరులో నిర్మాణ దశలో ఉన్నవాటికి ఇసుక అవసరం ఎక్కువగా ఉండటంతో కొన్నిచోట్ల పనులు నిలిపేసిన పరిస్థితి. తూర్పుగోదావరి నుంచి సగటున రూ.35 వేల నుంచి రూ.55 వేల వరకు కిరాయితో కలిపి కొనుగోలు చేసే పరిస్థితి.



**తెలంగాణకు అక్రమ రవాణా**

కుక్కునూరులో ఇబ్రహీంపేట రీచ్ నుంచి 5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేశారు. అధికారులు మూడు లారీలు సీజ్ చేశారు. గత నెల 22న వాహనాల్ని సీజ్ చేసినా.. సంబంధిత అధికార పార్టీ నేతలపై కేసులు నమోదు చేయలేదు. హడావుడిగా జాయింట్ కలెక్టర్ రీచ్‌లు సందర్శించి ఇసుక నిల్వలు అంచనా వేసి రెండు రీచ్‌ల్లో విక్రయాలు పూర్తిగా నిలిపేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపేట రీచ్‌లో 75 వేల టన్నులకు గాను 2 వేల టన్నులు అధికారికంగా, 5 వేల టన్నులు అనధికారికంగా విక్రయించగా, ఇంకో 68 వేల టన్నులు స్టాక్ పాయింట్‌లో ఉండాలి. అయితే 62,218 టన్నులే ఉంది. వింజరంలో భారీ గోల్‌మాల్ జరిగింది. ఇసుక విక్రయాలు ప్రారంభ సమయంలో 1500 టన్నులు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు నిర్ధారించి ప్రకటించారు. దీనిలో 308 టన్నులు విక్రయించగా.. 1,142 టన్నుల ఇసుక ఉండాలి. అధికారులు మాత్రం ఇప్పుడు 1,772 టన్నులు నిల్వ ఉన్నట్టు చూపుతున్నారు. చేబ్రోలులో 564 టన్నులతో విక్రయాలు ప్రారంభించగా నెలన్నర నుంచి 103 టన్నులు మాత్రమే అమ్మకాలయ్యాయి. మట్టి కలిసి ఉండటంతో ప్లాస్టింగ్‌కు పనికిరాదనే కారణం, లారీ ధర రూ.35 వేలు దాటుతుండటంతో ఎవరూ కొనుగోలు చేయని పరిస్థితి. రవాణా చార్జీలు నెలన్నర గడిచినా ఖరారు చేయలేదు.

## క్లుప్తంగా

### ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



రెబ్బా నాగేంద్రబాబు

చింతలపూడి: పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రేచర్లకు చెందిన రెబ్బా నాగేంద్రబాబు (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గ్రామంలో ఓ రైతుకు చెందిన పొలంలో దుక్కి దున్నుతుండగా, ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడటంతో ట్రాక్టర్ కింద పడి నాగేంద్రబాబు ఊపిరాడక ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ బోల్తా

ఉంగుటూరు: నాచుగుంట వద్ద జాతీయరహదారిపై లోడు లారీ తిరగబడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. తాడేపల్లిగూడెం నుంచి చెన్నై వెళుతున్న ఐరన్ లోడు లారీ మరో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు.

### హంసలదీవి బీచ్‌లో వివాహిత మృతి

మండవల్లి: సముద్ర స్నానానికి వెళ్లి ఓ వివాహిత మృతి చెందినట్లు నాగభూషణపురం గ్రామస్తులు చెప్పారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగభూషణపురం గ్రామానికి చెందిన షేక్ సర్దార్ బాషా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కృష్ణా జిల్లా కోడూరు మండలం హంసలదీవి బీచ్‌కు వెళ్లారు. వీరు సముద్ర స్నానం చేస్తుండగా సర్దార్ బాషా భార్య షేక్ ఫజల (26) అలలకు కొట్టుకుపోగా, ఆమెను రక్షించి ఒడ్డుకు తీసుకు వచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందింది. ఫజల మృతదేహాన్ని నాగభూషణపురం తీసుకువచ్చినట్లు గ్రామస్తులు చెప్పారు.

# మోత మోగుతున్న కనకం

- ధరలో కాదు.. ఈ సారి అమ్మకాల్లో
- కొనుగోలుదారులతో షాపులు కళకళ
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 20 రోజుల్లో రూ.500 కోట్ల వరకు పసిడి విక్రయాలు
- రూ.300 కోట్ల వరకు రిటైల్ అమ్మకాలే
- కలిసొచ్చిన పండగలు, వివాహాల సీజన్
- దిగుమతిపై సుంకం తగ్గింపు ప్రభావం



నరసాపురం పట్టణంలో కొనుగోలు దారులతో కళకళలాడుతున్న ఓ నగల దుకాణం

నరసాపురం: 'కంచు మోగునట్టు కనకంబు మోగునా' అంటూ వేమన తన పద్యంలో పేర్కొనడం తెలిసిందే. అయితే గత 20 రోజుల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరిలో కనకం మోత మోగుతోంది. అది ధరల్లో కాదు.. ఈసారి అమ్మకాల్లో. ధరల పెరుగుదల వేళ వార్తల్లో నిలిచే బంగారం ఈ సారి ఉమ్మడి పశ్చిమగోదావరిలో అమ్మకాల విషయంలో రికార్డు సృష్టించింది. గత నెల 26న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత రికార్డు స్థాయిలో బంగారం ధరలో తగ్గుదల కనిపిస్తోంది. ఇలా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని 18 నుంచి ఆరు శాతానికి తగ్గించినట్టు ప్రకటించగానే బంగారం ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకుని గత 20 రోజుల్లోనే ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఏకంగా రూ.500 కోట్ల వరకు బంగారం అమ్మకాలు టర్నోవర్ సాగినట్టుగా బులియన్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వీటిలో అధిక శాతం రూ.300 కోట్ల వరకు కేవలం ఆభరణాల వంటి రిటైల్ వ్యాపారమే సాగినట్టుగా చెబుతున్నారు. 2020 కరోనా విజృంభణకు ముందు నాలుగైదు సంవత్సరాల్లో గాని, ఈ మధ్యకాలంలో గానీ ఎప్పుడూ ఈ స్థాయిలో అమ్మకాలు సాగలేదని బులియన్ వర్తకులు చెబుతున్నారు. బంగారం ధరలు భారీగా తగ్గడంతో ఇప్పటికీ జిల్లాలో బంగారం అమ్మకాల స్పీడ్ తగ్గలేదు. నరసాపురం, భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు లాంటి ప్రధాన పట్టణాల్లో బంగారం షాపులు కళకళలాడుతున్నాయి.

**కలిసొచ్చిన సీజన్**

ప్రస్తుతం శ్రావణమాసం కొనసాగుతుండటంతో పాటు వచ్చే నెలలో వినాయక చవితి, ఆ తర్వాత దసరా, దీపావళి తదితర పండగలు వరుసగా రానున్నాయి. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కూడా ప్రారంభమవుతోంది. దీంతో పండుగలకు, సామాజిక అవసరాల నిమిత్తం పెళ్లిళ్లకు బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్నవారు ఇదే మంచి తరుణమని జ్యూయలరీ షాపుల వైపు పరుగులు తీసున్నారు. ముంబై ధరలను అనుసరించి వ్యాపారం సాగే పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం బులియన్ మార్కెట్‌లో గురువారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.72,300, 22 క్యారెట్ల 916 కేడీఎం ఆభరణాల బంగారం ధర రూ.53,300గా ట్రేడయ్యింది. అంటే కాసు (8 గ్రాములు) ధర రూ.42,640గా ఉంది. బడ్జెట్ ప్రవేశపెట్టే రోజున ఉదయం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.75,250గా ఉంది. అంతకు కొన్ని రోజుల ముందు రూ.78 వేలకు కూడా ట్రేడయ్యింది. ప్రస్తుతం ఇంత స్థాయిలో ధరలు తగ్గడంతో కొనుగోళ్లు ఎక్కువగా సాగుతున్నాయి. అమ్మకాలు భారీగా పెరగడంపై బులియన్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇక జిల్లాలో నెలకు రూ.2 కోట్ల చొప్పున విక్రయాలు జరిగే పెద్ద జ్యూయలరీ షాపుల్లో గత నెల 26 నుంచి 20 రోజుల్లోనే రూ.6 కోట్ల వరకు అంటే మూడు రెట్లు అధికంగా అమ్మకాలు సాగించినట్టు చెబుతున్నారు.

### అమ్మకాలు మూడు రెట్లు పెరిగాయి



గత 20 రోజుల నుంచి బంగారం షాపులు ఖాళీ ఉండటం లేదు. ముఖ్యంగా ఆభరణాల అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. గత నెల చివరి నుంచి అమ్మకాల విషయంలో తేడా కనిపిస్తోంది. బడ్జెట్‌లో బంగారంపై దిగుమతి సుంకం తగ్గడమే దీనికి ప్రధాన కారణం. దాదాపు ప్రతి జ్యూయలరీ షాపులో అమ్మకాలు మూడు రెట్లు పెరిగాయి. కరోనా తరువాత ఈ స్థాయిలో అమ్మకాలు సాగడం ఇప్పుడే చూస్తున్నాం. రానున్న రోజుల్లో దసరా, దీపావళి లాంటి పండుగలు రానున్నాయి. అయితే బంగారం ధరలు మళ్లీ పెరగొచ్చేమో చెప్పలేం. – వినోద్‌కుమార్‌జైన్, అధ్యక్షుడు, నరసాపురం బులియన్ మర్చంట్ అసోసియేషన్



### ఈ ఊరట ఎంతవరకో..

ప్రస్తుతం బంగారం ధరలు భారీగా తగ్గడంతో పాటు నిలకడగా కొనసాగుతోంది. కరోనా సెకండ్ వేవ్ తరువాత మళ్లీ రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో బంగారం ధరల్లో భారీ పెరుగుదల చూశాం. వెండి కూడా ఒక దశలో కిలో లక్ష రూపాయలు దాటిన ధర కొంతమేర తగ్గింది. మరో పక్క డాలర్‌తో రూపాయి మారకపు విలువ కూడా భారీ హెచ్చుతగ్గులను చూస్తోంది. ప్రస్తుతం డాలర్ విలువ రూ.86కు చేరింది. మరో పక్క షేర్ మార్కెట్ ఒడిదుడుకుల్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మదుపరులు సురక్షితమైన పెట్టుబడిగా భావించి బంగారం కొనుగోళ్లకు దిగితే మళ్లీ బంగారం ధరలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పటి నుంచో బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుంటూ వస్తున్నవారు ఒక్కసారిగా కొనుగోళ్లకు మక్కువ చూపడంతో ఆభరణాల అమ్మకాల జోరు పెరిగినట్టుగా చెబుతున్నారు. ఈ 20 రోజుల్లో హోల్‌సేల్ వ్యాపారం ఎక్కువగా జరిగే నరసాపురంలో అత్యధికంగాను, తరువాత భీమవరంలోను పెద్ద ఎత్తున అమ్మకాలు సాగాయని అంచనా. మొత్తంగా బంగారం అమ్మకాల ఈ కొత్త జోరు ఎన్ని రోజులు ఉంటుందో చూడాలి.

### పోలీసు ముసుగులో బురిడీకి యత్నం?

ద్వారకాతిరుమల: కొందరు కేటుగాళ్లు పోలీసులమంటూ వ్యాపారులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అర్జెంట్‌గా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని, కానిస్టేబుల్‌తో నగదు పంపిస్తామని నమ్మబలుకుతున్నారు. ఇటీవల ఓ వ్యాపారి ఇలా మోసపోగా, తాజాగా ఆదివారం మరో వ్యాపారి, అలాగే ద్వారకాతిరుమల సొసైటీ ఉద్యోగి చాకచక్యంగా కేటుగాడు పన్నిన వల నుంచి తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గుర్తు తెలియని వ్యక్తి ద్వారకాతిరుమలలోని ఒక వ్యాపారికి నెల క్రితం ఫోన్ చేశాడు. తాను పోలీసునని, డబ్బులు అర్జెంటుగా అవసరమని చెప్పి, ఫోన్‌పే చేస్తే తన కానిస్టేబుల్‌తో క్యాష్ పంపిస్తానని నమ్మబలికాడు. దాంతో సదరు వ్యాపారి ఆ మాయగాడి మాటలు నమ్మి అతను కోరిన రూ.45 వేలను ఫోన్‌పే ద్వారా పంపాడు. ఆ తరువాత ఎంతసేపటికీ కానిస్టేబుల్ రాకపోవడంతో అనుమానం వచ్చి అతని నంబర్‌కు కాల్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో అతడు మోసపోయినట్టు తెలుసుకున్నాడు. జరిగిన మోసాన్ని చెప్పుకోలేక నిమ్మకుండిపోయాడు. ఇదిలా ఉంటే ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి ద్వారకాతిరుమలలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ యజమాని ఓజీఆర్ కుమార్‌కు ఫోన్ చేసి తాను ఏఎస్‌ఐ భాస్కరరెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. తన బంధువు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండటం వల్ల తనకు అర్జెంటుగా డబ్బు అవసరమైందని చెప్పాడు. తన ఫోన్‌పే నంబర్‌కు రూ.30 వేలు పంపితే, మీ పెట్రోల్ బంకు వద్దకు మా కానిస్టేబుల్ క్యాష్ తీసుకొచ్చి ఇస్తాడని చెప్పాడు. అయితే తనకు పెట్రోల్ బంకు లేదని చెప్పగా, కేటుగాడు వెంటనే ఫోన్ కట్ చేశాడు. ఇదే తరహాలో సొసైటీ కార్యదర్శి నల్లూరి కిషోర్‌కు ఫోన్ చేసి మోసం చేసే ప్రయత్నం చేశాడు. ఈ విషయంపై ఓజీఆర్ కుమార్, సొసైటీ కార్యదర్శి చర్చించుకున్న తరువాత కేటుగాడు చేసిన నంబర్‌కు ఫోన్ చేయగా, కేటుగాడి నుంచి స్పందన లేకపోవడం గమనార్హం.



# అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని రామకోటి వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులను 24 గంటలు గడవకముందే అరెస్ట్ చేసినట్లు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ప్రాంతానికి చెందిన 35 ఏళ్ల మహిళ భర్త చనిపోవటంతో పెదవేగి మండలం విజయరాయి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో జీవనం సాగిస్తోంది. వీరిద్దరూ కూలి పనులు చేసుకునేందుకు ఏలూరు వచ్చారు. వన్‌టౌన్‌లోని ఓ హోటల్‌లో పనులు చేసుకుంటూ రామకోటి వద్ద రాత్రివేళ పడుకుంటున్నారు. ఏలూరు చెంచులకాలనీకి చెందిన నూతిపల్లి పవన్, లంబాడీపేటకు చెందిన నారపాటి నాగేంద్ర, ఎంఆర్‌సీ కాలనీకి చెందిన గడ్డి విజయ్‌కుమార్ రోడ్డుపై వ్యర్థాలను ఏరుకుంటూ వాటిని విక్రయిస్తూ, జులాయిగా తిరుగుతూ ఉంటారు. వీరు శుక్రవారం అర్ధరాత్రి వేళ వీరిద్దరి వద్దకు వచ్చి భర్తతో కలిసి మద్యం తాగారు. అనంతరం ఆమెపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించగా కేకలు వేయటంతో భర్త లేచి వారిని అడ్డుకోగా, అతడిని కొట్టి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అటువైపు వెళుతున్న బాలాజీ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో 15 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి వెళ్లి బాధిత మహిళను ఏలూరు జీజీహెచ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఎస్సై లక్ష్మణబాబు, టూటౌన్ ఎస్సై సాధిక్, సిబ్బంది నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు లక్ష్మణబాబు, నవీన్‌కుమార్ ఉన్నారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ రాజశేఖర్

# రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పెంటపాడు: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఎన్‌కే గ్రౌండ్స్ ఎదురుగా శనివారం రాత్రి జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై ఎస్.శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంటా వీరరాఘవతి (77), అతని కుమారుడు కోటేశ్వరరావు హైదరాబాద్ నుంచి కారులో శనివారం స్వగ్రామమైన నిడదవోలు వెళుతున్నారు. ప్రత్తిపాడు ఎన్‌కే గ్రౌండ్స్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పల్టీ కొట్టి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లగా, కారులో ఉన్న రాఘవతికి తీవ్ర గాయాలు కాగా, ఆమెను 108 అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. డ్రైవింగ్ చేస్తున్న కోటేశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఎస్సై శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



# విద్యుదాఘాతానికి ఆటోడ్రైవర్ దుర్మరణం

భీమడోలు: విద్యుత్ షాక్ గురై ఓ ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూరప్పగూడెం గ్రామానికి చెందిన బోను వెంకటరమణ (52) ఆటో నడుపుకుంటూ జీవనం సాగుస్తున్నాడు. ఆదివారం ఇంట్లో డ్రెయినేజీని శుభ్రం చేసేందుకు పొడవాటి ఇనుప రాడ్‌ను తీసుకుని వచ్చేందుకు పక్కనే ఉన్న తన తోడల్లుడికి చెందిన రెండంతస్తుల భవనంపైకి వెళ్లాడు. అక్కడ నుంచి ఇనుప రాడ్‌ను తీసుకుని వచ్చే క్రమంలో ఇంటిని అనుకుని ఉన్న విద్యుత్ తీగకు ఇనుప రాడ్ ప్రమాదవశాత్తు తగిలింది. దీంతో షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతనిని భీమడోలు సీహెచ్‌సీకి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు అరవింద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటో యూనియన్ నాయకునిగా అందరి తలలో నాలుకగా ఉండే బోను వెంకటరమణ మృతిపై తోటి ఆటో డ్రైవర్లు కన్నీటిపర్యంతమయ్యారు. అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు భారీగా తరలివెళ్లారు.



బోను వెంకట రమణ మృతదేహం

# బాలకృష్ణశర్మకు మూడు పురస్కారాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన జ్యోతిష అవధాని గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్‌శర్మ ఆదివారం ఒకే వేదికపై మూడు పురస్కారాలు అందుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను బాలకృష్ణ శర్మ శిష్యులు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. బెంగళూరులోని శ్రీవిశ్వవేద విద్యాపీఠ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో, విశ్వవిద్యాలయం, శివ యోగాశ్రమ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ అంతర్జాతీయ జ్యోతిష శాస్త్ర పండిత సదస్సులో జ్యోతిష శాస్త్రానికి బాలకృష్ణ శర్మ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ వేదికపై ఆయనకు జ్యోతిష శాస్త్ర విశిష్ట డాక్టరేట్, గ్లోబల్ ఎక్సలెన్స్ పురస్కారం, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాలను అతిథులు అందజేశారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర సంస్కృత అకాడమీ మాజీ చైర్మన్ నందకిషోర్ పురోహిత్, శ్రీ విశ్వవేదవిద్యాపీఠ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దివాకరన్, రామానుజ గురుకుల జ్యోతిష పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బద్రీనాథ్ పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకుంటున్న బాలకృష్ణ శర్మ



# ఆక్వాటిక్ చికెన్.. తిలాపియా

- లాభదాయకంగా.. తిలాపియా చేపల సాగు
- ఆక్వాటిక్ చికెన్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- అంతర్జాతీయ మార్కెట్‌లో యమ డిమాండ్
- సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం



కొణితివాడలో తిలాపియా సాగు చేస్తున్న చెరువు



తిలాపియా చేపలు

కైకలూరు: నీలి విప్లవం కొత్త పుంతలు తొక్కుతోంది. చేపల సాగులో అభివృద్ధి చేసిన హైబ్రీడ్ వంగడాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో ఒకటి తిలాపియా. ఆక్వాటిక్ చికెన్‌గా ప్రపంచ వ్యాప్తంగా ఈ చేపకు గుర్తింపు ఉంది. అత్యంత చౌక, ముళ్లు లేని బోన్‌లెస్ తిలాపియా ఫిల్లెట్‌కు ప్రపంచ మార్కెట్ ఉంది. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలను తిలాపియా జోన్లుగా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు అందించి ఈ సాగును ప్రోత్సహిస్తోంది.

మంచి రుచితో పాటు తక్కువ రేటుకు లభ్యమయ్యే తిలాపియా (గురక) చేపకు మంచి డిమాండ్ ఉంది. మన రాష్ట్రంలో ఉభయగోదావరి, ప్రకాశం, కృష్ణా, నెల్లూరు జిల్లాలో సాగు చేస్తున్నారు. ప్రపంచ ఆక్వా ఉత్పత్తులలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో ఉంది. తిలాపియా 21వ శతాబ్దపు ఆహార చేపగా పరిగణించబడుతోంది. చైనా, ఈజిప్ట్, ఫిలిప్పీన్స్, బ్రెజిల్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌లో ఎక్కువగా ఈ చేప సాగు చేస్తున్నారు. కొల్లేరు పరిసర ప్రాంతల్లో ఈ సాగు చేపట్టడంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

**తిలాపియా అంటే..**

గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, వాగులు, సరస్సుల్లో శరీరంపై ముళ్లతో కూడిన పొట్టి గురక చేపనే తిలాపియా అంటారు. దీని శాస్త్రీయనామం ఒరియాక్రోమిస్ నిలోటికాస్. అయితే ప్రస్తుతం డిమాండ్ కలిగిన తిలాపియాను జన్యుపరంగా అభివృద్ధి చేశారు. దీనిని జెనిటికల్లి ఇన్‌ప్రూవ్డ్ ఫార్మడ్ తిలాపియా (గిఫ్ట్)గా పిలుస్తారు. సాధారణంగా గురక చేపలు ఎక్కువగా గుడ్లు పెట్టడం వల్ల చిన్న సైజులోనే ఉంటాయి. ఈ కారణంగా శాస్త్రవేత్తలు కేవలం మగ తలాపియాలను మాత్రమే అభివృద్ధి చేశారు. మంచినీరు, ఉప్పునీరు అన్న తేడా లేకుండా ఏ నీటిలోనైనా తిలాపియా పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా నైలు తిలాపియా, బ్లూ తిలాపియా, మెజామ్‌బిక్యూ తిలాపియా అనే మూడు రకాలు ఉన్నాయి.

**ఆర్‌జీసీఏ పరిశోధన ఫలితం..**

మన రాష్ట్రంలో కంకిపాడు వద్ద రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ (ఆర్‌జీసీఏ), మెరైన్ ప్రాడక్ట్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (ఎంపెడా) ఆధ్వర్యంలో మలేషియా సాంకేతిక సహకారంతో జెనిటికల్లి ఇమ్‌ప్రూవ్ ఫార్మడ్ తిలాపియా (గిఫ్ట్)ను అభివృద్ధి చేసింది. మగ తిలాపియా సీడ్‌ను వీరు రైతులకు అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టును 2008లో ప్రారంభించగా, ఇప్పటివరకు దాదాపు 48.74 మిలియన్ల గిఫ్ట్ తిలాపియాలను 569 మంది రైతులు ప్రైవేట్ పరిశోధనా సంస్థలకు అందించారు. వ్యవసాయ మంత్రిత్వశాఖ (మినిస్ట్రీ ఆఫ్ ఆక్వాకల్చర్) ఎస్ఎఫ్‌డీఏ ద్వారా తిలాపియా సాగు చేసే రైతులకు ప్రొత్సాహకాలు అందిస్తున్నారు.

**అవగాహన అవసరం**

కొల్లేరు పరిసర ప్రాంతాల్లో సాగు చెరువుల్లో తెల్ల చేపతో పాటు నీటి ద్వారా వచ్చే గురక జాతి పెరుగుతోంది. ఇవి చిన్న సైజులో ఉంటాయి. పైగా ఆడ చేపలు ఎక్కువగా గుడ్లు పెట్టడంతో వీటి సంతతి విపరీతంగా పెరుగుతోంది. వీటిని పండుగప్ప చేపలకు ఆహారంగా కూడా అందిస్తున్నారు. అభివృద్ధి చేసిన గిఫ్ట్ తిలాపియాలో మగ చేపలను మాత్రమే పెంచుకునే అవకాశం ఉంది. తెల్లచేపలు కేజీ రూ.115 ధర మార్కెట్‌లో పలుకుతుండగా, బోన్‌లెస్ తిలాపియా ఫిల్లెట్ (ముక్కలుగా డ్రెస్సింగ్ చేసినవి) కేజీ రూ.180 నుంచి రూ.200 ధర పలుకుతోంది. తిలాపియా సాగుపై ఆర్‌జీసీఏ అవగాహన కలిగిస్తోంది.

### వేగంగా పెరుగుతుంది



గిఫ్ట్ తిలాపియా చేప వేగంగా పెరుగుతుంది. రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుంది. సెలైన్ వాటర్ (లవణాలు 12–15 శాతం) ఉన్నప్పటికీ సాగు చేయవచ్చు. కేజ్, పెన్ కల్చర్‌లో సైతం సాగు చేయవచ్చు. తెల్ల చేపల సాగుతో పోల్చితే ఈ సాగుకు పెట్టుబడి తక్కువ. లాభాలు అధికంగా ఉంటాయి. దేశంలో చేపల వినియోగం 2024–25 నాటికి 12 గ్రాముల వార్షిక తలసరి వినియోగాన్ని సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ, విదేశీ మార్కెట్‌లో తిలాపియాకు మంచి డిమాండ్ ఉంది. – ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మత్స్యశాఖ అధికారి, నిడమర్రు

**పోషకాల గని**

పోషకాల గనిగా తిలాపియా చేపకు పేరుంది. తిలాపియాలో తక్కువ కొవ్వు, అధిక కాల్షియం, విటమిన్ ఏ, డీ, సీ, బీ12, బీ6 ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వీటి శరీర కండ ఎక్కువగా ఉంటూ చికెన్ మాదిరిగా కనిపిస్తుంది. పోషకాలతో పాటు రుచి కూడా ఎంతో బాగుంటుంది. పలు హోటల్స్‌లో తిలాపియా డిష్‌లకు మంచి డిమాండ్ ఉంది. ఈజిప్టు రాజుల పాలన నుంచి తిలాపియా చేపకు అత్యధిక ప్రాధాన్యత ఉండేదని అక్కడ జరిగిన తవ్వకాల్లో లభ్యమైన శిలాఫలకాలను బట్టి తెలుస్తుంది. నైలునది పరీవాహక ప్రాంతాల్లో ఈ చేప చిత్రాలను గోడలపై ముద్రించడం విశేషం.

## క్లుప్తంగా

### లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరిగింది. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్రవైద్యశాల వైద్యుల బృందంతో 74 మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం 9 మందిని నిడదవోలకు పంపారు. 20 మందికి ఉచితంగా కళ్లజోడ్లు పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ పచ్చా వెంకటేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, సీహెచ్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



లక్ష్మీనారాయణపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

అత్తిలి: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం, కట్టావారిపాలెం గ్రామాలలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మలను తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ, ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, ఇదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, జి నాగేశ్వరరావు, వాసుదేవ, చక్రధర్, తారకేశ్వరి, సుజాత, సత్యనారాయణ, రాము, లోకేష్, దుర్గా భవాని, బానుమతి తదితరులు పాల్గొన్నారు.

### కోడిపందేల శిబిరంపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో కోడిపందేల శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని, రూ.13,980లు నగదు, ఒక కోడి పుంజు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేత



తణుకులో మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ప్రభుత్వం సాయం మంజూరు చేసేందుకు వీలుగా తణుకు నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మంజూరు పత్రాలు అందజేశారు. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన బోడపాటి నాగ సునీతకు రూ. 1.47లక్షలు, అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన అల్లం దేవి నాగరేవతికి రూ. లక్ష చొప్పున మంజూరు పత్రాలను అందజేశారు.

### ఉండిలో ఘనంగా వేదపారాయణం

ఉండి: శ్రావణమాసం చతుర్దశిని పురస్కరించుకుని ఉండి రాజులపేటలోని శివాలయంలో ఆదివారం వేదసభను నిర్వహించారు.అర్చకుడు సన్నిధిరాజు చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభను సమాజ శ్రేయస్సు దృష్ట్యా ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ప్రపంచశాంతి కోసం, ప్రకృతి వైపరీత్యాల నుంచి భూమిని కపాడాలని, ప్రజలంతా సుఖసంతోషాలతోను, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వేదపారాయణతో పాటు ఉపనిషత్తులు చదవడం ద్వారా ఆ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ వేదసభలో 43 మంది ఘనాపాఠీలు, 32 మంది క్రమపాఠీలు, 22 మంది స్మార్థపండితులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: శ్రావణ మాసం మూడో ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రతి వారం తరలివచ్చిన ట్లుగానే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఆహ్లాదం...ఆవిరి



అపరిశుభ్రంగా ఉన్న స్థానిక ఎఫ్‌సీఐ కాలనీలో చిరంజీవి చిల్డ్రన్ పార్కు



స్థానిక ఎఫ్‌సీఐ కాలనీలో చిరంజీవి చిల్డ్రన్ పార్కులో పాడైపోయిన ఆట వస్తువులు

- నిర్వహణ లేక అధ్వానంగా పార్కులు
- మూలకు చేరిన ఆట వస్తువులు
- పార్కులపై పర్యవేక్షణ శూన్యం
- పిచ్చి మొక్కలతో వాసవి పార్కు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆహ్లాదం కరువు అయ్యింది. పట్టణంలోని పిల్లలు ఆటలు ఆడుకునేందుకు అన్ని వసతులతో కూడిన పార్కులు లేవు. పేరుకు మాత్రమే పార్కులుగా దర్శనం ఇస్తున్నాయి. వేలాది రూపాయిలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన ఆట వస్తువులు నేడు కానరావడం లేదు. అనేక పార్కులలో గడ్డి మొక్కలు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి పార్కులోకి సైతం వెళ్లలేని విధంగా తయారయ్యాయి. వాకింగ్ ట్రాక్ ఉంటే ఆ మార్గం తప్ప, పార్కులో మరేమీ కానరావడం లేదు. పార్కులపై పర్యవేక్షణ లేదు. వివరాలలోకి వెళ్లితే పట్టణంలో మదర్‌వన్నినీ ఆసుపత్రికి ఎదురుగా లక్ష్మిప్రియ ఎస్టేట్ వద్ద పార్కు, ఎఫ్‌సీఐ కాలనీ రోడ్డులో చిరంజీవి పార్కు, పీఅండ్‌టీ కాలనీలో వాసవి పార్కు, హౌసింగ్ బోర్డులో రెండు పార్కులు, వీకర్స్‌కాలనీలోని పార్కు, కనక లక్ష్మి అమ్మవారి గుడి వద్ద పార్కు, సుబ్బారావుపేటలోని అమృత నిధులతో ఏడోవ వార్డులో పార్కు, అదే విధంగా పట్టణంలో రెండు టౌన్‌లలోను పలు ప్రాంతాలలో పార్కులు పేరుతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఖాళీ స్థలాలు చుట్టూ కాంపౌండ్‌లు కట్టి వాటిని నిరుపయోగంగానే వదలేశారు. కొన్ని పార్కులలో వాకింగ్ నిమిత్తం వాకింగ్ ట్రాక్, కూర్చోవడానికి మాత్రమే బెంచీలు వేసి, మొక్కలు నాటారు. అయితే పిల్లలు ఆటలు ఆడుకునే ఆట వస్తువులు వసతులు లేవు.

**పిచ్చి మొక్కలతో వాసవి పార్కు:**

ఆర్యవైశ్యులు నిర్వహణలో వాసవి క్లబ్ పర్యవేక్షణలో పీఅండ్‌టీ కాలనీలో 2004 నుంచి పార్కు నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు అనువుగా ఉండేది. అనంతరం కాలంలో పార్కు నిర్వహణ బాధ్యత నుంచి వాసవి క్లబ్ తప్పుకోవడంతో ఆ పార్కు పిచ్చిమొక్కలతోను, ఆకులు, అలములతోను, పిచ్చి మొక్కలు నెలకుని నేడు శిథిలమైంది. విష జంతువులకు ఆవాసంగా మారింది. పిల్లలు, పెద్దలు పార్కులోకి వెళ్లేందుకు కూడా నేడు వీలు లేకుండా ఉంది.

**చిరంజీవి పార్కు**

స్థానిక 33వ వార్డు ఎఫ్‌సీఐ కాలనీలో ఎంపీ నిధులతో డాక్టర్ కె.చిరంజీవి మునిసిపల్ చిల్డ్రన్ పార్కును 2016లో రూ. 25 లక్షలతో ఏర్పాటు చేశారు. పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు. కొంత కాలం పార్కులో పిల్లల ఆట పాటలతో ఉల్లాసంగాను, ఉత్సాహంగా గడిపారు. అనంతరం పార్కు పిల్లలకు ఆడేందుకు వీలు లేకుండా పోయింది. ఆట వస్తువులు తుప్పు పట్టి పాడై శిథిలమైయ్యాయి. నేడు అవి ప్రమాదకరంగా మారాయి. కొత్త పరికరాలు ఏర్పాటు చేయలేదు. పార్కులో ఉండాల్సిన జారుడు బల్లలు, ఊగే ఊయల, అప్ అండ్ డౌన్స్, కొలంబస్, మంకీ బౌన్స్ నేడు కానరావడం లేదు.పాడైన వస్తువులను పార్కులో ఒక మూల ఉంచారు.

**లక్ష్మిప్రియ ఎస్టేట్‌లో విశాలమైన పార్కు**

పట్టణ ప్రజలందరు ఆహ్లాదకరంగా గడిపేందుకు వీలుగా కొట్టు సత్యనారాయణ మొట్టమొదటి సారిగా ఎన్నికైన సమయంలో ఊరి శివారు ప్రాంతంలో నల్లజర్ల రోడ్డులో మదర్‌వన్నినికి ఎదురుగా ఉన్న లక్ష్మిప్రియ ఎస్టేట్‌లో విశాలమైన పార్క్ నిర్మాణానికి అంకుర్పారణ చేశారు. పట్టణ ప్రజలందరికి ఉపయోగపడే విధంగా లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్, ఒపెన్ థియేటర్, పిల్లల ఆటవస్తువులు ఉంచేందుకు నిర్ణయించారు. అయితే అప్పుడు రాజకీయ కారణాలు వల్ల ఆ పార్కు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోయాయి.

### పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కు కావాలి



పట్టణ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆహ్లాదకరమైన పార్కును పట్టణంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. స్వచ్ఛంధ సేవా సంస్థలు, దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా విశాలమైన ఆవరణలో వాకింగ్ ట్రాక్, పిల్లలకు అన్నిరకాలైన ఆట వస్తువులు, పచ్చనిచెట్లు, చూడ ముచ్చటగా గ్రీనరీతోను, ఫౌంటైన్‌లతో ఆదర్శవంతమైన పార్కును అభివృద్ధి చేయాలి.

– బత్తుల ప్రసాద్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, తాడేపల్లిగూడెం



పిచ్చి మొక్కలతో దారి మూసుకుపోయిన వాసవి పార్కు ముఖద్వారం



ఏడో వార్డులో అమృత పథకంలో పార్కులో పిల్లలు ఊగేందుకు ఖాళీగా ఉన్న రాడ్‌లు



పార్కులో తుప్పు పట్టి పాడై విరిగి మూలన పడిన ఆట పరికరాలు

### వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పైడిపర్రు పరిసర గ్రామాల్లోని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందజేశారు. షేక్‌మస్తాన్ ఆర్థిక సాయంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం పాల్గొన్నారు.

### 20న మానవత శాంతి ర్యాలీ

పెంటపాడు: ఈనెల 20న పెంటపాడులో మానవత శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా విద్యాకమిటీ చైర్మన్ తాడేపల్లిమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెంటపాడు మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పెంటపాడులో నూతనంగా నిర్మించిన మానవత ఫ్రీజర్‌షెడ్డును ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు ఎస్టీవీఎన్ స్కూల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సభ్యులు, మానవత అభిమానులు విజయవంతం చేయాలని మోహనరావు కోరారు.

### అధ్వానంగా కత్తవపాడు రోడ్డు

ఇరగవరం: అధ్వాన్నంగా ఉన్న కత్తవపాడు, జుత్తిగ రోడ్డును నిర్మించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామ ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఐదేళ్లుగా ఈరోడ్డు పూర్తిగా పాడై గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఈరోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నిరసనలో ప్రజా సంఘాల నాయకులు కామన మునిస్వామి, దంపబోయిన అరుణకుమారి, డి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్

- నేడు రాఖీ పౌర్ణమి
- ఆకట్టుకుంటున్న విభిన్న రాఖీలు
- కళకళలాడుతున్న దుకాణాలు
- ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు



తణుకులో రాఖీల కొనుగోళ్లతో కళకళలాడుతున్న దుకాణాలు

తణుకు: అన్నా చెల్లెళ్లు.. అక్కా, తమ్ముళ్ల మధ్య ఆత్మీయ బంధానికి చిహ్నంగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకున్నా... మన కోసం అండగా నిలిచే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదర భావాన్ని పెంపొందించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. సోదరుడంటే తోడబుట్టిన వాడే కానక్కర్లేదు. చెల్లెమ్మ... నేనున్నా నంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానమే. అందుకే వీరి అనుబంధానికి ప్రతీకగా శ్రావణమాసంలో పౌర్ణమినాడు రక్షాబంధన్ (రాఖీ) పండుగ జరుపుకొంటూ ఉంటారు.

**జోరందుకున్న అమ్మకాలు...**

సోమవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని తణుకులో రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులు, చూడగానే ఆకట్టుకుంటున్న మోడల్స్‌లో రాఖీలు యువతకు కనువిందు చేస్తున్నాయి. ఈ సారి వివిధ రూపాల్లో మార్కెట్లోకి వచ్చిన రాఖీలు చూడగానే ముచ్చటగొలిపే విధంగా ఉన్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్లో రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. తణుకు పట్టణంలోని పలు హోల్‌సేల్ దుకాణాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రాఖీలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో ఆయా దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి. మార్కెట్‌లో రూ. 5 నుంచి రూ. 200 వరకూ ధరలు పలుకుతున్నాయి. అన్ని వర్గాలకు అవసరమైన రాఖీలను తణుకులో విక్రయిస్తున్నారు. మరో వైపు చిన్నారులకు ఆకట్టుకునేందుకు డోరేమాన్, మోటు పంతులు, మిక్కిమౌస్, హనుమాన్ వంటి బొమ్మలను రాఖీలపై ఏర్పాటు చేయడంతో వాటిని చిన్నారులు ఆసక్తిగా చూసి కొనుగోలు చేస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా వాటిని తయారు చేశారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. దుకాణాల్లోనే కాకుండా ఆన్‌లైన్స్లోనూ రాఖీల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్లలో రాఖీలకు సంబంధించి అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటికి పలు ఆఫర్లను సైతం అందిస్తున్నాయి. దానికి తోడు వెండితో తయారు చేసిన రాఖీలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రూ. 800 నుంచి రూ. 4 వేల వరకు వెండితో తయారు చేసిన రాఖీలు విక్రయిస్తున్నారు. ప్రముఖ బంగారు దుకాణాలు సైతం ఆన్‌లైన్‌లో ఇలాంటి రాఖీలను విక్రయిస్తున్నాయి.



మార్కెట్‌లో అమ్మకానికి వివిధ రకాల రాఖీలు



వెండితో తయారు చేసిన రాఖీలు

### ఘనంగా రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మండలంలోని చిన సారవ రామాలయం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా ఏర్పాటు చేశారు. బ్రహ్మశ్రీ అనిల్‌కుమార్ అచార్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటుకు సహకరించిన దాతలు జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ,, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ తదితరులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మొల్లేటి పెద్దిరాజు, కుక్కల ఏసుబాబు, కవురు మహేశ్వరరావు, కడలి రాంబాబు, దొంగ మురళీకృష్ణ, గుబ్బల కోటేశ్వరావు, చింతపల్లి కనకరాజు, గుత్తుల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భయపెడుతున్న పాములు

పెనుగొండ: పాములు వ్యవసాయ కార్మికులను భయపెడుతున్నాయి. వరుస పాముకాటులతో కార్మికులు హడలెత్తిపోతున్నారు. పెనుగొండ మండలంలో ఇటీవల పలువురు బెంగాలీ కార్మికులు పాముకాటుకు గురయ్యారు. ముఖ్యంగా రక్త పింజరి పాములు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో వ్యవసాయ పనులకు వచ్చే కార్మికులను కాటు వేస్తున్నాయి. వరి నాట్లు వేయడానికి పశ్చిమబెంగాల్ నుంచి బెంగాలీ కార్మికులు అధిక సంఖ్యలో ఆచంట నియోజకవర్గానికి తీసుకు వస్తుంటారు. వీరో ఒక్కో బంటాకు 20 నుంచి 30 మంది కార్మికులు వరకూ కలసి వస్తుంటారు. వీరు వరినాట్లు పూర్తి చేసిన అనంతరం వరి చేలవద్దే ఏర్పాటు చేసిన మకాంల్లో విశ్రాంతి తీసుకొంటుంటారు. దీంతో వీరు పాముకాటుకు అధిక సంఖ్యలో గురవుతున్నారు. వడలిలో ఇటీవల ఓ బెంగాలీ కార్మికుడిని పాము కాటు వేయడంతో వైద్యం అందిలోపునే మరణించాడు. అదేవిధంగా దేవలో ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనుల్లో భాగంగా పంట కాలువలు బాగు చేస్తుండగా మహిళా కార్మికురాలు పాముకాటుకు గురైంది. దీంతో పాటు సుమారు 20 మంది నుంచి 30 మంది వరకూ పాము కాటుకు గురైనా సకాలంలో వైద్యం చేయించుకోవడంతో బతికారు. వీరితో పాటు పెనుగొండ శివారు చిన్నంవారి పాలెం, వడలి ప్రాంతాల్లో పలువురు రైతులు పాము కాటుకు గురయ్యారు. పాము కాటు గుర్తించిన వారు సకాలంలో వైద్యం తీసుకోవడంతో ఇబ్బందులు లేకుండా బయట పడతున్నారు. ఆలస్యం చేసిన వారు పెనుగొండ, సిద్ధాంతం ఆసుపత్రుల నుంచి తణుకు, ఏలూరు ప్రభుత్వాసుపత్రిల వరకూ వెళ్లాల్సి వస్తుంది. అయితే బెంగాలీ కార్మికులు వారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారిని పనులకు తీసుకు వచ్చినపుడు బీమా చేయాంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటూ సీపీఎం నాయకుడు సూర్నిడి వెంకటేశ్వరరావు సూచించారు.

### భీమవరం-భద్రాచలం అల్ట్రా డీలక్స్ సర్వీసు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం-భద్రాచలం మధ్య క్రొత్త అల్ట్రా డీలక్స్ సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. భీమవరం డిపో డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో అనేక మంది ప్రయాణికులు భద్రాచలం నూతన సర్వీసు భీమవరం డిపో నుంచి పెట్టమని కోరడంతో ఉదయం 4.30 గంటలకు భీమవరంలో బయలుదేరి కైకలూరు, ఏలూరు, చింతలపూడి, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ మీదుగా భద్రాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటలకు అక్కడ నుంచి బయలుదేరి భీమవరం రాత్రి 7:30 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాచలం సర్వీసును ఆదరించాలని, ఈ సర్వీసుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఇతర వివరాలకు 96660 89036, 98665 81333 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

ఆకివీడు: భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసేదిగా వక్ఫ్ బిల్లు ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎస్‌వీ గోపాలన్ ఆరోపించారు. స్థానిక షాదీఖానాలో ఆదివారం వక్ఫ్ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జాబితాకి సంబంధించిన వక్ఫ్ ఆస్తులపై కేంద్రం అజమాయిషీ చేయడాన్ని ఫెడరల్ వ్యవస్థపై జరిగే దాడిగా ఆయన విమర్శించారు. వక్ఫ్ బిల్లు సవరణ అవసరం ఎవరికని, ఎందుకని ఆయన ప్రశ్నించారు. ముస్లిం పెద్దలు ఎండీ మస్తాన్ వలీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాన్ని తొలగించి, కలెక్టర్లకు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. బిల్లును ముస్లింలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉపాధ్యాయుడు షాజన్, ఎండీ.జక్కి, అజ్మల్, అహ్మద్ పాల్గొన్నారు.

### కొయ్యే చిట్టిరాజుకు సన్మానం

భీమవరం: ఐపీఎస్‌కు సెలెక్ట్ అయిన కొయ్యే చిట్టి రాజును ఆదివారం బేతని చర్చ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టా దేవరాజ్ మాట్లాడుతూ కొయ్యే చిట్టి రాజు ఐపీఎస్‌కు ఎంపిక అవ్వడం భీమవరం పట్టణానికి గర్వకారణమని ఆయన అన్నారు. పట్టుదలతో కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని ఆయన అన్నారు. అనంతరం ఘనంగా చిట్టి రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పుష్పరాజు పాల్గొన్నారు

# ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి



తాడేపల్లిగూడెం రూరల్: నీలాద్రిపురం సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



తణుకు టౌన్: సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం ఎదురుగా ఉన్న పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంఘ పెద్దలు పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. సంఘ అధ్యక్షుడు దాసరి రాంబాబు మాట్లాడుతూ ప్రథమ బహుజన నాయకుడు సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. పేదలకు ధనసాయం చేయడంలో పాపన్న గౌడ్ పేరు జనగాం ప్రదేశంలో మార్మోగిందన్నారు. గ్రామాల్లోని పలువురు యువకులు పాపన్న గౌడ్ వద్ద సైనికులుగా చేరారని గుర్తు చేశారు. వారికి యుద్ధ విద్యలు నేర్పి సైనికులుగా తీర్చిదిద్దారన్నారు. పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోమలి శ్రీను, చిటకబత్తుల శ్రీను, చిటకబత్తుల సత్యనారాయణ, చిటకబత్తుల అంజి, సూరగాని బుల్లియ్య, పూరెళ్ల దానయ్య, దాసరి నాగేశ్వరరావు, గౌడ సంఘ యువకులు పాల్గొన్నారు.

**సర్దార్ పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి**

తణుకు టౌన్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సర్దార్ పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఆదివారం గణపతి గౌడ సేవా సంఘం ఆధ్వర్యంలో తణుకులో ఘనంగా నిర్వహించారు. కొమ్మాయి చెరువు గట్టు వద్దగల పాపన్న గౌడ్ విగ్రహానికి పలువురు గౌడ్ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ గౌడ్ సంఘ పెద్దలతో పాటు నాయవాది కామన మునిస్వామి, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు మట్టా వెంకట్, వెలగన శ్రీనివాసు, వీరమల్లు ఫణీంద్ర, రాజులపాటి శ్రీనివాసు, కొండేటి శ్రీనివాస్, రేలంగి శ్రీనివాస్, కట్టా రాజేష్,రాచమల్ల రామకృష్ణ, కొండయ్య, కట్టా సతీష్ పాల్గొన్నారు.